క్లుప్తంగా...

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.51, నల్లవంకాయ 35, పొడుగు వంకాయ 35, బెండకాయ 28, పచ్చిమిర్చి 50, బజ్జీమిర్చి 55, క్యాప్సికమ్ 55, పచ్చకాకర 38, పందిరి బీర 28, క్యాబేజీ 23, క్యారెట్ 43, దొండ 28, గుండుబీన్స్ 50, గింజ చిక్కుడు 55, గోకరకాయ 35, కీర 16, దోసకాయ 28, బీట్‌రూట్ 26, ఉల్లిగడ్డ 32, ఆలుగడ్డ 21, కందగడ్డ 40, సొరకాయ 13, పొట్లకాయ 23, అరటికాయ 11, మునగకాయ 3–4, ముల్లంగి 4–6.

విద్యుదాఘాతంతో గృహోపకరణాలు దగ్ధం

అడ్డగుట్ట: ప్రమాదవశాత్తు విద్యుదాఘాతం సంభవించి గృహోపకరణాలు దగ్ధమైన ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. అడ్డగుట్ట అంజయ్య విగ్రహం సమీపంలోని ఓ ఇంట్లో బుధవారం ఉదయం విద్యుదాఘాతంతో ఫ్రిడ్జ్, సీలింగ్ ఫ్యాన్‌తో పాటు ఇతర వస్తువులు దగ్ధమయ్యాయి. అదృష్టవశాత్తు ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. స్థానికులు మంటల ను అదుపుచేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు.

ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం


హమాల్‌బస్తీలో పర్యటించి కోట నీలిమా

బన్సీలాల్‌పేట్: ప్రజా సమస్యల పరిష్కారంలో అధికార పార్టీ నాయకులు పూర్తిగా విఫలమయ్యారని సనత్‌నగర్ కాంగ్రెస్ నాయకురాలు డాక్టర్ కోట నీలిమా ఆరోపించారు. బుధవారం సాయంత్రం బన్సీలాల్‌పేట్ డివిజన్ హమాల్‌బస్తీలో ఆమె పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజల ఓట్లతో అధికారంలోకి వచ్చిన మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. హమాల్‌బస్తీలో చాలా కాలం నుంచి స్థానిక ప్రజలు ఇళ్ల మధ్య మరుగుదొడ్ల దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సనత్‌నగర్‌లో మార్పు కోసం ప్రజలు కాంగ్రెస్‌కు అండగా ఉండాలన్నారు. కాంగ్రెస్ పార్టీ పేద, మధ్య తరగతి వర్గాలకు అండగా నిలుస్తుందన్నారు.

ఉద్యోగులకు భద్రత కల్పించాలి


బొల్లారం పీఎస్‌లో కృష్ణయ్య

రసూల్‌పురా: సమగ్ర శిక్షా కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని ఉద్యోగులకు మద్దతుగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపీ ఆర్. కృష్ణయ్య లక్డీకాపూల్ లోని విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం ముందు రోడ్డుపై బైఠాయించడంతో పోలీసులు అరెస్టు చేసి బొల్లారం పీఎస్‌కు తరలించారు. కృష్ణయ్యను బొల్లారం పీఎస్‌కు తరలించారనే సమాచారం మేరకు పలువురు పీఎస్ వద్దకు చేరుకుని గేటు ముందు బైఠాయించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ.. సమగ్ర శిక్షా కాంట్రాక్టు ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనం అమలు, హెల్త్ ఇన్సూరెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం సొంత పూచికత్తుపై విడిచిపెట్టారు.

ప్రొ.గాలి వినోద్‌కుమార్‌కు వీడ్కోలు


వినోద్‌కుమార్ దంపతులను సన్మానిస్తున్న అధ్యాపకులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ న్యాయ కళాశాల అధ్యాపకులు ప్రొ.గాలి వినోద్‌కుమార్‌కు ఘనంగా వీడ్కోలు పలికారు. ఉద్యోగానికి వీఆర్‌ఎస్ ఇచ్చిన గాలి వినోద్‌కుమార్ అయన భార్య చంద్రకళను బుధవారం కాలేజీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అధ్యాపకులు సన్మానించి ఆయన సేవలను కొనియాడారు. ప్రిన్సిపల్ ప్రొ.రాధిక యాదవ్, లా సీనియర్ అధ్యాపకులు, దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొ.జీబీ రెడ్డి, హెడ్ ప్రొ.వెంకటేశ్వర్లు, ప్రొ.రాంప్రసాద్ పాల్గొన్నారు.

సన్మానం


డీఈ ప్రశాంతిని సన్మానిస్తున్న కంది శైలజ

బౌద్ధనగర్: జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ డీఈగా బాధ్యతలు చేపట్టిన ప్రశాంతిని డివిజన్ కార్పొరేటర్ కంది శైలజ బుధవారం వార్డు కార్యాలయంలో కలిసి శాలువా తో ఘనంగా సత్కరించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.



ఫోర్ వే రహదారులు.. సుందరంగా కూడళ్లు


మెట్టుగూడ-తార్నాక మార్గంలో చేపట్టిన రహదారి విస్తరణ పనులు

- సికింద్రాబాద్‌లో తుది దశకు విస్తరణ, ఆధునీకరణ పనులు
- నాలుగేళ్ల ప్రతిపాదనలకు కార్యరూపం
- పాదచారులకు మార్గం సుగమం
- ట్రాఫిక్ సమస్యలకు చెక్

సికింద్రాబాద్ : సికింద్రాబాద్‌లో ప్రధాన రహదారుల విస్తరణ, ఆధునీకరణ పనులు తుదిదశకు చేరుకుంటున్నాయి. పాదచారులకు మార్గం సుగమం చేయడం, ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టడం, కూడళ్లను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడం కోసం జీహెచ్ఎంసీ ఉత్తర మండలం అధికారులు నాలుగేళ్ల క్రితం రూపొందించిన ప్రతిపాదనలకు కార్యరూపం లభిస్తుంది. రహదారుల విస్తరణ, ఫుట్‌పాత్‌ల నిర్మాణం, కోసం రూ.20 కోట్ల అంచనా వ్యయంతో అప్పట్లోనే అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇందులో భాగంగా ఆలుగడ్డబావి వద్ద రైల్వే వంతెనకు మరో అండర్‌పాస్ నిర్మాణాన్ని చేపట్టనున్నారు.

కూడళ్ల ఆధునీకరణ

రైల్‌నిలయం సమీపంలోని ఆలుగడ్డబావి వంతెన, ఒలిఫెంటా వంతెన, సంగీత్, సెయింట్‌జాన్స్ కూడళ్లను ఆధునీకరించే పనులు ప్రారంభమయ్యాయి. అంతకు ముందు ఫుట్‌పాత్‌ల ఆధునీకరణ పనులు జరుగుతున్నాయి. మెట్రో కారిడార్‌ల నిర్మాణం సమయంలోనే రహదారుల విస్తరణ పూర్తయింది. కరోనా పరిస్థితుల కారణంతో ఫుట్‌పాత్‌ల నిర్మాణం ఆధునీకరణ పనులు ముందుకు సాగలేదు. తాజాగా ఫుట్‌పాత్‌ల నిర్మాణం పనులు పూర్తి చేస్తున్న అధికారులు ఆపై కూడళ్లను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దే పనులకు శ్రీకారం చుట్టనున్నారు. ఆలుగడ్డబావి వద్ద రైల్వే లైన్ కింద మరో అండర్ బ్రిడ్జిని నిర్మించడంతోపాటు అక్కడి కూడలిని ఆధునీకరిస్తున్నారు. ఇప్పటికే ఈ కూడలిలో ఏర్పాటు చేసిన వాటర్ ఫౌంటెయిన్‌ను మరింత ఆధునీకరించి ప్రయాణికులకు కనువిందు చేసే విధంగా తీర్చిదిద్దనున్నారు. ఒలిఫెంటా వంతెన సమీపంలోని చిలకలగూడ కూడలి, సంగీత్ కూడలి ప్రాంతాలను ఆధునీకరించే ప్రతిపాదనలకు త్వరలోనే మోక్షం లభించనుంది.

నాలుగు జంక్షన్ల మధ్య రాకపోకలకు మార్గం సుగమం..

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌ను ఆవరించి ఉన్న నాలుగు ప్రధాన రహదారులను ఆసాంతం ఫోర్ వే గా తీర్చిదిద్దే పనులు జరుగుతున్నాయని ఉత్తర మండలం జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులు చెబుతున్నారు. తద్వారా ఈప్రాంతంలో ట్రాఫిక్ సమస్యలకు పరిష్కారం చూపేందుకు కార్యాచరణను అమలు చేస్తున్నామన్నారు. ఆలుగడ్డబావి రైల్వే వంతెనకు మరో అండర్‌పాస్ ఏర్పాటు కోసం నిధులు విడుదల చేశామన్నారు. ఈ ఏడాదిలోగా అండర్‌పాస్‌ను అందుబాటులోకి తేనున్నట్టు చెప్పారు. ఫలితంగా నాలుగు జంక్షన్ల మధ్య వాహనాల రాకపోకలను మార్గం సుగమం చేస్తామన్నారు.

జోరుగా అమావాస్య అన్నదానాలు


అన్నదానంలో పాల్గొన్న శ్రీగణేశ్, పాండుయాదవ్


బాపూజీనగర్‌లో ఆలయంలో రఘుచరన్ దంపతుల పూజలు

కంటోన్మెంట్: కంటోన్మెంట్‌లో అమావాస్య సెంటిమెంట్ బలపడుతోంది. ఎన్నికల వేళ నేతల హడావిడితో అమావాస్య రోజున ఆలయాల వద్ద అన్నదానాలు కొనసాగుతున్నాయి. బోయిన్‌పల్లి బాపూజీనగర్ శ్రీదేవీ నల్లపోచమ్మ ఆలయ ప్రాంగణంలో ప్రతి అమావాస్య రోజు అన్నదానం నిర్వహించడం ఆనవాయితీగా సాగుతోంది. ఈ సారి ప్రముఖ పారిశ్రామిక వేత్త రఘుచరన్–కవిత దంపతుల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. చిన్నతోకట్టా కట్టమైసమ్మ ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి బీఆర్‌ఎస్ సీనియర్ నేత శ్రీగణేశ్, బోర్డు మాజీ సభ్యుడు పాండుయాదవ్ హాజరయ్యారు. రెండోవార్డు రసూల్‌పురా ఉషా గోడౌన్ సమీపంలో, మూడోవార్డు పాతాళ పంచముఖ ఆలయ ప్రాంగణాల్లో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాల్లో బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పాల్గొన్నారు. బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ బాపూజీనగర్, జయనగర్, చిన్నతోకట్టా ఆలయాల్లో నిర్వహించిన అన్నదానాల్లో పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పాదయాత్రతో సమస్యల పరిష్కారానికి చర్యలు


మాట్లాడుతున్న కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి

సనత్‌నగర్: బస్తీలు, కాలనీల్లో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పాదయాత్ర ద్వారా అక్కడికక్కడే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారని బేగంపేట కార్పొరేటర్ మాధవరం కృష్ణారావు అన్నారు. ఈ నెల 19 నుంచి బేగంపేట డివిజన్‌లో ఇంటింటికీ పాదయాత్ర నిర్వహించనున్న నేపథ్యంలో బుధవారం నాయకులు, కార్యకర్తలతో ఏర్పాటుచేసిన సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను సైతం మాధవరం కృష్ణారావు ముందుండి పరిష్కరించారన్నారు. శ్యాంలాల్ బిల్డింగ్స్‌లో రాష్ట్రానికే రోల్ మోడల్‌గా వైకుంఠధామం నిర్మించారని, బేగంపేట నాలా పరీవాహక ప్రాంత నివాసితుల ముంపు సమస్య శాశ్వత పరిష్కారానికి మంత్రి తలసానితో పాటు ఎమ్మెల్యే కృష్ణారావు ఎంతో చొరవ తీసుకున్నారన్నారని గుర్తు చేశారు. దీంతో పాటు అన్ని కాలనీలు, బస్తీల్లో రోడ్లు, డ్రైనేజీ, మంచినీరు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం, పార్కుల అభివృద్ధి వంటి మౌలిక సదుపాయాలను కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నేత శ్రీహరి, డివిజన్ అధ్యక్షుడు సురేష్ యాదవ్, నరేష్ పాల్గొన్నారు.

పైప్‌లైన్ పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కంది శైలజ

బౌద్ధనగర్: డివిజన్ పరిధిలోని అభివృద్ధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని కార్పొరేటర్ కంది శైలజ అన్నారు. అంబర్‌నగర్‌లో జరుగుతున్న తాగునీటి పైప్‌లైన్ పనులను బుధవారం ఆమె పరిశీలించి మాట్లాడారు. ఎప్పటికప్పుడు సమస్యలను గుర్తించి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అవసరమైన అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్నామని ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

‘సంక్షేమ పథకాల అమలులో విఫలం’


బౌద్ధనగర్‌లో పర్యటిస్తున్న బీజేపీ నాయకులు

బౌద్ధనగర్: సంక్షేమ పథకాల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి ఆరోపించారు. రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం ఆయన డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పార్టీ నేతలతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల సౌకర్యార్థం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను కొంత మందికి మాత్రమే అందించడం సరికాదన్నారు. నియోజకవర్గంలో 10 వేల డబుల్ బెడ్రూమ్‌లు కట్టివ్వకపోతే ఓటు అడగనని చెప్పిన స్థానిక ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ కేవలం 500 ఇళ్లు మాత్రమే నిర్మించారన్నారు. మాయమాటలతో ప్రజలను మోసం చేస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ఈ సారి ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో మేకల కీర్తి, వెంకటేష్ యాదవ్, సాయి దత్తు, శ్రీనివాసరావు, సత్యనారాయణ, అమరావతి సురేష్, రవీందర్ గౌడ్, రవి, యాదమ్మ, మమత, సుశీల పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి


ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి తలసాని

బన్సీలాల్‌పేట్: మేకలబండ బస్తీ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ హామీ ఇచ్చారు. బుధవారం వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులతో కలిసి మేకలబండ ప్రాంతంలో ఆయన పర్యటించగా బస్తీలో నీటి సరఫరాను మెరుగు పర్చాలని, కమ్యూనిటీహాల్‌పై అదనపు అంతస్తు నిర్మాణానికి చర్యలు, కుట్టుశిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు తదితర సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి ఆయా శాఖల అధికారులను పిలిచి వెంటనే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అత్తెల్లి అరుణగౌడ్, జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్, ఈఈ సుదర్శన్, విద్యుత్ డీఈ శ్రీధర్, జలమండలి సీజీఎం ప్రభు, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ క్రిస్టోఫర్, నాయకులు జగన్, అభిషేక్, సూరి, చిట్టిబాబు, వినయ్, వరమ్మ, కౌసల్య, శ్రీదేవి పాల్గొన్నారు.

రసీదులు లేకుండా తరలిస్తున్న 20 కిలోల వెండి రూ.5 లక్షలు స్వాధీనం

సికింద్రాబాద్: సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ఒక వ్యక్తి నుంచి రసీదులు లేకుండా తీసుకెళ్తున్న 20 కిలోల వెండి కడ్డీలు, రూ.5.20 లక్షల నగదును రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జీఆర్‌పీ పోలీసుల కథనం ప్రకారం.. తమిళనాడు రాష్ట్రం సేలంకు చెందిన సెల్వకుమార్ అనే వ్యక్తి నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో బంగారు నగలు తయారు చేసే దుకాణంలో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. తాను పనిచేస్తున్న ఆర్మూర్ నుంచి బస్సులతో బయలుదేరి శబరి ఎక్స్‌ప్రెస్ రైలులో తమిళనాడు వెళ్లేందుకు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు వచ్చాడు. రైల్వే పోలీసుల తనిఖీల్లో సెల్వకుమార్ లగేజీ నుంచి వెండిక డ్డీలు, నగదు బయటపడ్డాయి. వాటికి సంబంధించిన రసీదులు రుజువులు చూపించని కారణంగా వెండి, నగదును పోలీసులు సీజ్ చేసి సెల్వకుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు.

‘సమస్యల పరిష్కారం బీజేపీతోనే సాధ్యం’


ప్రజలతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సుచిత్ర

రాంగోపాల్‌పేట్: దేశం, రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ ఉంటేనే ప్రజా సమస్యలకు పరిష్కారం లభిస్తుందని రాంగోపాల్‌పేట్ కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్ అన్నారు. బుధవారం బస్తీ బాటలో భాగంగా ఆమె డివిజన్‌లోని కళాసీగూడ తదితర ప్రాంతాల్లో ఇంటింటికి తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేశంలో ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తుందని, మరికొన్ని పథకాల కోసం రాష్ట్రానికి నిధులు అందిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఆ నిధులను దారి మళ్లిస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఆకుల ప్రతాప్, సాయి, గోపీనాథ్, శ్రీధర్, అశ్విన్, స్వప్న, నిర్మల పాల్గొన్నారు.

పక్కా రోడ్డు నిర్మాణం చేపట్టాలి


మట్టి రోడ్డును చూపిస్తున్న మహేశ్

లాలాపేట: లాలాపేట ప్రధాన రహదారి నుంచి సత్యానగర్‌కు వెళ్లే మార్గంలో మట్టి రోడ్డులో పక్కా రోడ్డు వేస్తామని చెప్పిన అధికారులు కాలయాపన చేస్తున్నారని సామాజిక కార్యకర్త నేతికార్ మహేశ్ అన్నారు. బుధవారం ఆయన రోడ్డును పరిశీలించి మాట్లాడారు. వర్షాకాలంలో ఈ గుంతలు, వేసవిలో దుమ్ము రేగుతున్న ఈ రోడ్డుతో ప్రజలు నానా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సత్యానగర్, ఇందిరానగర్, శ్రీపురికాలనీ, చంద్రబాబునగర్ తదితర ప్రాంతాలకు చెందిన దాదాపు వందల మంది నిత్యం ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారని ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిగా గుంతలమయంగా మారిందన్నారు. సంబంధిత అధికారులు స్పందించి పక్కా రోడ్డు నిర్మాణం చేయాలని విజ్ఞప్తి చేశారు.

వర్సిటీల బంద్ ప్రశాంతం

ఉస్మానియా యూనివర్సిటీ: ఉద్యోగాల పర్మనెంట్ కోసం కాంట్రాక్టు అధ్యాపకులు చేపట్టిన యూనివర్సిటీల బంద్ ప్రశాంతంగా ముగిసింది. బుధవారం తెలంగాణ వర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకుల జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని వివిధ వర్సిటీలను బంద్ చేశారు. ఓయూ, కేయూ, పాలమూరు, శాతవాహన, తెలంగాణ, తెలుగు వర్సిటీ, మహిళా విశ్వవిద్యాలయం, జేఎన్‌టీయూ తదితర యూనివర్సిటీల పరిధిలోని వివిధ కాలేజీలను బంద్ చేసినట్లు తెలిపారు. ఈ నెల 19, 20 తేదీలలో ఇందిరా పార్క్ వద్ద 48 గంటల సామూహిక సమర దీక్షను చేపట్టనున్నట్లు అధ్యాపక జేఏసీ నాయకులు వేల్పుల కుమార్, ఉపేందర్ రావు, విజేందర్‌రెడ్డి తెలిపారు.

జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌లో సత్తా


విద్యార్థులను సన్మానిస్తున్న అధ్యాపకులు

సికింద్రాబాద్: జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ చాటి పతకాలు సాధించిన సీతాఫల్‌మండి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు బుధవారం అధ్యాపకులు సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఆనంద్ కుమార్ మాట్లాడుతూ.. సీతాఫల్‌మండి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు అన్ని రంగాల్లో తమదైన శైలిలో దూసుకుపోవడం గర్వించదగ్గ విషయమన్నారు. కళాశాల నుంచి ఎంఈసీలో రాష్ట్రస్థాయి ప్రథమ ర్యాంకు సాధించామని చెప్పారు. సీఈసీ చదువుతున్న విద్యార్థులు గోవర్దన్ జావెలిన్ త్రోలో సిల్వర్, నారాయణ్ నాయక్ 5కే రన్నింగ్‌లో సిల్వర్, యశ్వంత్ 100 మీటర్ల రన్నింగ్‌లో సిల్వర్ మెడల్స్ సాధించి కళాశాలకు పేరు తీసుకువచ్చారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు కవిత, బాలరాజు, పద్మావతి, బబిత, అరుణ, యుగేందర్, సంజీవరెడ్డి, ప్రశాంతి పాల్గొన్నారు.

విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరికి జైలుశిక్ష

లాలాపేట: విధి నిర్వహణలో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్ విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరికి జైలు శిక్ష విధించిన ఘటనా ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై భార్గవి వివరాల ప్రకారం.. మాణికేశ్వర్‌నగర్‌కు చెందిన శ్రీశైలం, చిలకలగూడ ప్రాంతానికి చెందిన ప్రశాంత్ ఈ నెల 10న తార్నాక చౌరస్తాలో విధుల్లో ఉన్న నల్లకుంట ట్రాఫిక్ స్టేషన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్‌తో వాగ్వాదానికి దిగి విధులకు ఆటంకం కలిగించారు. హెడ్ కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు ఇరువురిని నాంపల్లి కోర్టులో ప్రవేశపెట్టగా 8వ స్పెషల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ లక్ష్మణ్‌రావు 20 రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారు.

రైల్వే ప్రాజెక్టులు, డబుల్ లైన్ల నిర్మాణం హర్షం



లాలాపేట: మూడు రైల్వే ప్రాజెక్టులు, డబుల్ లైన్ నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై సికింద్రాబాద్ నియోజకవర్గ బీజేపీ అధికార ప్రతినిధి శారదా మల్లేష్ హర్షం వ్యక్తం చేశారు. మహబూబ్‌నగర్ నుంచి గుత్తి వరకు దాదాపు రెండు గంటల ప్రయాణ సమయం ఆదా అవుతుందన్నారు. దీంతో పాటు మేడ్చల్ నుంచి ముత్కేడ్ వరకు, అత్యంత రద్దీగా ఉంటే బీబీనగర్, గుంటూరు మార్గంలో డబుల్ లైన్ వేయడంతో రైళ్ల వేగం పెరగడంతో పాటు ప్రయాణికుల సమయం ఆదా అవుతుందన్నారు.